## కమిల్ అల్ తయిబ్ ఇద్రిస్

సూడాన్ నూతన ప్రధానిగా కమిల్ అల్ తయిబ్ ఇద్రిస్ నియమితులయ్యారు. ఆ దేశంలో 2023లో పౌర యుద్ధం వచ్చిన తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి వ్యక్తి ఆయన.

**తపన్ కుమార్ దేఖా:** ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్న తపన్ కుమార్ దేఖా పదవీకాలాన్ని 2026, జూన్ వరకు పొడిగిస్తూ కేంద్ర నియామకాల క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.



# అంతర్జాతీయం

### మహమ్మారి వ్యతిరేక ఒప్పందం

- భవిష్యత్తులో తలెత్తే మహమ్మారులను సమర్థంగా, సమైక్యంగా ఎదుర్కొనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాలు తొలిసారి ప్రపంచ మహమ్మారి వ్యతిరేక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కొవిడ్-19 విజృంభణ అనంతరం మూడేళ్లుగా కొనసాగుతున్న చర్చల ఫలితమే ఈ ఒప్పందం. ఈ ఒప్పంద ఓటింగ్‌లో అనుకూలంగా 124 దేశాల్లో 11 దేశాలు గైర్హాజరయ్యాయి. వ్యాక్సిన్లు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స విధానం అన్ని దేశాలకు సమానంగా అందుబాటులోకి రానుంది. ప్రపంచ వైద్య మౌలిక సదుపాయాలపై అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం పెరగనుంది.

### ట్రాన్స్ ఫ్యాట్స్

- అసంతృప్త కొవ్వులనే ట్రాన్స్ ఫ్యాట్స్ అంటారు. వీటిని అరికట్టడంలో నాలుగు దేశాలు మంచి ప్రతిభ చూపాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఆ దేశాలు ఆస్ట్రియా, నార్వే, ఒమన్, సింగపూర్.

### ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్




- 24వ ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్ మంత్రుల స్థాయి సమావేశం మే 21న శ్రీలంక నేతృత్వంలో వర్చువల్‌గా కొలంబో నుంచి నిర్వహించారు. 'భవిష్యత్తు తరాలకు సుస్థిర హిందూ మహాసముద్రం' అనే ఇతివృత్తంతో కొనసాగింది. కొలంబో ప్రకటన వెలువరించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించాలని, సింధూ నది ప్రాంతాన్ని భద్రత, శాంతియుత, అభివృద్ధి ప్రాంతంగా మార్చాలని నిర్ణయించారు.

### ఏఐ క్లినిక్

- కృత్రిమ మేధతో కూడిన ఒక వైద్య క్లినిక్‌ను ప్రపంచంలో తొలిసారి సౌదీ అరేబియాలో



అందుబాటులోకి తెచ్చారు. చైనాకు చెందిన సైన్వి, అల్మోసా అనే సంస్థలు దీన్ని ఏర్పాటు చేశాయి. రోగ నిర్ధారణ, చికిత్స తదితర వ్యవహారలను అన్నింటిని కూడా కృత్రిమ మేధతో పనిచేసే వైద్యులే చేపడతారు.

### ఆసియా ప్రొడక్టివిటీ ఆర్గనైజేషన్

- జపాన్‌లోని టోక్యో కేంద్రంగా పనిచేసే ఈ సంస్థకు నాయకత్వ బాధ్యతలను భారత్ స్వీకరించింది. 2025-26కు భారత్ అధ్యక్షత వహించనుంది. వివిధ వస్తువుల ఉత్పత్తితో పాటు డిజిటల్ పరివర్తన, సుస్థిరత, సృజన, వ్యవస్థాపన తదితర అంశాల మెరుగుకు ఈ కూటమి 1961లో ఏర్పాటయ్యింది. భారత్ నుంచి అమర్‌దీప్ సింగ్ భాటియా దీనికి నాయకత్వం వహించనున్నారు.

### గోల్డెన్ డోమ్

- అమెరికా రక్షణకు గోల్డెన్ డోమ్ వ్యవస్థను అందుబాటులోకి తేనున్నారు. ఇందులో ఉపగ్రహాలు కీలక పాత్రను పోషిస్తాయి. భూమి, అంతరిక్షం నుంచి అమెరికా గగనతలంపై దృష్టి సారిస్తూ రక్షణ కల్పించే వ్యవస్థ ఇది. అమెరికా వైపునకు ఏ క్షిపణి ఎటు నుంచి వచ్చినా పసిగట్టి ధ్వంసం చేస్తుంది.

# జాతీయం

### అటవీ భూమిపై తీర్పు

- అటవీయేతర అవసరాలకు కేటాయించిన అటవీ భూములను వెనక్కు తీసుకోవాలని సుప్రీంకోర్ట్ ఆదేశించింది. పుణెలో 1998లో ఈ విధంగా ఒక ప్రైవేట్ వ్యక్తికి అటవీ భూమిని ఇచ్చారు. ఈ నేపథ్యంలో సుప్రీం తాజా ఆదేశాలను జారీ చేసింది. 1996లోని గోదావర్మన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్ట్ ఇదే తరహా తీర్పు చెప్పింది. అటవీ భూముల్లో ఇతర కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టరాదని ఆ తీర్పులో పేర్కొంది.



### పర్యావరణ అనుమతులపై సుప్రీంకోర్ట్ తీర్పు

- పరిశ్రమలు ఏర్పాటు చేసిన అనంతరం పర్యావరణ అనుమతులు తీసుకోవచ్చంటూ కేంద్రం చేసిన చట్టం చెల్లదంటూ సుప్రీంకోర్ట్ తీర్పు చెప్పింది. నిబంధనలో మార్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి విరుద్ధమని సర్వోన్నత న్యాయ స్థానం వెల్లడించింది. వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్ట్ ఈ తీర్పును వెలువరించింది.

### సంపూర్ణాక్షరాస్యత రాష్ట్రం

- తమ రాష్ట్రం సంపూర్ణాక్షరాస్యతను




సాధించిందని మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దౌమ ప్రకటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించగా అక్షరాస్యత 95% దాటినట్లు గుర్తించారు. దేశంలో సంపూర్ణక్షరాస్యత సాధించిన తొలి పరిపాలన యూనిట్ లడఖ్.

### ఈ-జీరో ఎఫ్ఐఆర్

- ఈ-జీరో ఎఫ్ఐఆర్ అనే కొత్త విధానాన్ని కేంద్ర హోం మంత్రి ప్రారంభించారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ దీన్ని అమలు చేయనుంది. న్యాయ పరిధితో నిమిత్తం లేకుండా నమోదయ్యే కేసులను జీరో ఎఫ్ఐఆర్ అంటారు. సాధారణంగా సైబర్ నేరాలను జాతీయ సైబర్ నేర రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా లేదా 1930 ద్వారా ఫిర్యాదు చేస్తారు. ఈ నేరం విలువ రూ. 10 లక్షలు మించితే అది జీరో ఎఫ్ఐఆర్‌గా నమోదవుతుంది.




# వార్తల్లో వ్యక్తులు

### కెంపయ్య సోమశేఖర్



- మణిపూర్ ప్రధాన న్యాయమూర్తిగా కెంపయ్య సోమశేఖర్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు కర్ణాటక హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు.

### గీతా సమోటా

- సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న గీతా సమోటా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. సీఐఎస్ఎఫ్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళ ఆమె.

### మోనికా కేజియా సెంబిరింగ్

- హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలేలో ఇండోనేషియాకు చెందిన మోనికా కేజియా సెంబిరింగ్ విజయం సాధించారు. రెండో స్థానంలో మిస్ కామెరూన్ ఇస్సే ప్రిన్సెస్ నిలువగా, మూడో స్థానంలో ఇటలీకి చెందిన చైరా ఎస్పోసిటో ఉన్నారు.

### భాను ముస్తాక్

- కర్ణాటక రచయిత భాను ముస్తాక్ రచించిన 'హార్ట్ ల్యాంప్'నకు ఇంటర్నేషనల్ బుకర్-2025 అవార్డ్ దక్కింది. దీన్ని ఇంగ్లిష్‌లోకి దీపా బస్తి అనువదించారు.

# రోజులు - ప్రాధాన్యం

### మే 22

- ఏటా మే 22న జీవ వైవిధ్య రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది థీమ్ 'హార్మొని విత్ నేచర్ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ (ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి)'.

### మే 21

- ఏటా మే 21న అంతర్జాతీయ తేయాకు దినోత్సవంతో పాటు భారతదేశంలో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక రోజుగా కూడా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇంటర్నేషనల్ టీ డే థీమ్ 'టీ ఫర్ లైవ్లీహుడ్, టీ ఫర్ ఎస్‌డీజీస్'.

### మే 20

- ఏటా మే 20ని వరల్డ్ మెట్రాలజీ డే గా నిర్వహిస్తారు. కొలతలు, ప్రమాణాలకు సంబంధించిన రోజు ఇది. ఈ ఏడాది థీమ్ 'మెజర్‌మెంట్స్ ఫర్ ఆల్ టైమ్స్, ఫర్ ఆల్ పీపుల్ (అన్ని కాలాలకు, అన్ని ప్రజలకు కొలతలు)'.

### మే 18

- ఏటా మే 18న ఇంటర్నేషనల్ మ్యూజియమ్ డే నిర్వహిస్తారు. మ్యూజియమ్‌లు సంస్కృతి తదితర అంశాలను అందరికీ తెలిపేందుకు ఉద్దేశించినవి. ఈ ఏడాది ఇతివృత్తం 'ది ఫ్యూచర్ ఆఫ్ మ్యూజియమ్స్ ఇన్ ర్యాపిడ్లీ చేంజింగ్ కమ్యూనిటీస్ (వేగంగా మారుతున్న సమాజాల్లో మ్యూజియమ్‌ల భవిష్యత్తు)'.



# తెలంగాణ

### ప్రకృతి వ్యవసాయం

- కేంద్ర ప్రభుత్వ జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని (ఎన్ఎంఎన్ఎఫ్) తెలంగాణలో రెండేళ్ల పాటు అమలు చేయాలని రాష్ట్ర



ప్రభుత్వం నిర్ణయించింది. సంప్రదాయ వ్యవసాయాన్ని శాస్త్రీయ దృక్పథంతో పునరుద్ధరించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతూ రైతుకుటుంబాలకు, వినియోగదారులకు రసాయనాల బెడద లేని ఆరోగ్యకర ఆహారాన్ని అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ రెండేళ్ల కాలానికి రూ. 2481 కోట్లతో ఎన్ఎంఎన్ఎఫ్ పథకానికి రూపకల్పన చేసింది. కేంద్ర ప్రభుత్వం 60% వాటా కింద సుమారు రూ. 1584 కోట్లు ఖర్చు చేయనుండగా, రాష్ట్రాలు 40% వాటా కింద సుమారు రూ. 897 కోట్లు భరించాలి.

### విచారణ కమిషన్ గడువు పొడిగింపు

- కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. జూలై నెలాఖరు వరకు ఈ పొడిగింపు చేసింది.

### యువ వికాసం

- నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం కింద తొలి ఏడాది 5 లక్షల మందికి మంజూరు పత్రాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### సూదితో పొడవకుండానే రక్త పరీక్ష

- దేశంలో తొలిసారిగా ప్రభుత్వ ఆస్పత్రి నిలోఫర్‌లో అమృత్ స్వాస్థ్య భారత్ కార్యక్రమంలో భాగంగా సూదితో పొడవాల్సిన అవసరం లేకుండా రక్త పరీక్ష చేసే ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్ సాధనాన్ని క్విక్ వైటల్స్ సంస్థ ద్వారా ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫలితాలు కూడా నిమిషాల వ్యవధిలో వస్తాయి.

### పోడు భూముల్లో వ్యవసాయం

- రాష్ట్రంలో పోడు భూములను వ్యవసాయ యోగ్యంగా తీర్చిదిద్దేందుకు ఇందిర సౌర గిరి జల వికాస పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. నాగర్ కర్నూలు జిల్లా మన్ననూర్ ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే 19న ప్రారంభించారు. రానున్న అయిదేళ్లలో ఈ పథకానికి రూ. 12,600 కోట్లను వ్యయం చేయనున్నారు.

### అనాథలకు ఆరోగ్యశ్రీ

- తల్లిదండ్రులు, సంరక్షకులు, బంధువులు లేని హైదరాబాద్‌లోని అనాథ పిల్లలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయనున్నారు. హైదరాబాద్‌లోని 2200 మంది అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో తొలిసారి హైదరాబాద్‌లోని చిన్నారులకు దీన్ని అమలు చేస్తున్నారు.

### మీ సేవకు కియోస్క్




- ప్రజా సంక్షేమ పథకాలకు దరఖాస్తు, జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందే నిరీక్షణ సమయాన్ని తగ్గించడంతో పాటు సంబంధిత సేవలను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'మీ-సేవ కియోస్క్'లను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని ప్రజాపాలన కేంద్రాలు, ఎంపిక చేసిన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒకసారి మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ అక్కడకు వెళ్లనవసరం లేకుండా కియోస్క్‌ల ద్వారా ఆన్‌లైన్‌లోనే రుసుం చెల్లించి నిమిషాల్లో ధ్రువపత్రాలను పొందవచ్చు. ఈ మేరకు ప్రయోగాత్మకంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టరేట్లు, ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంతో పాటు బేగంపేట మీ-సేవ కియోస్క్‌లను ఏర్పాటు చేశారు.

### అభిజిత్ బెనర్జీ

- ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'విజన్ బోర్డ్ ఆఫ్ తెలంగాణ రైజింగ్'లో సలహాదారుడిగా బాధ్యతలను స్వీకరించనున్నారు.

# సైన్స్ అండ్ టెక్నాలజీ

### ఈవోఎస్-09 ఉపగ్రహం



- పీఎస్ఎల్వీ సీ-61 ద్వారా ఇస్రో ప్రయోగించిన ఈవోఎస్-09 ప్రయోగం విఫలమైంది. ఇది ఈ భూపరిశీలన ఉపగ్రహం. ప్రయోగం తర్వాత మూడో దశలో సాంకేతిక ఇబ్బందులు రావడంతో ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ప్రకటించింది.

### సోడియం-అయాన్ బ్యాటరీ

- అత్యంత వేగంగా చార్జింగ్ చేసే సోడియం అయాన్ బ్యాటరీని బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కేవలం 6 నిమిషాల్లో 80% రీచార్జ్ పూర్తవుతుంది.

# క్రీడలు

### శివ్‌పాల్ సింగ్

- రెండోసారి కూడా డోపింగ్ పరీక్షలో విఫలం కావడంతో శివపాల్ సింగ్ ఎనిమిది సంవత్సరాల నిషేధాన్ని ఎదుర్కోనున్నాడు. ఆయన జావెలిన్ త్రో క్రీడాకారుడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.

### ఎస్ఏఎఫ్ఎఫ్ అండర్-19 చాంపియన్‌షిప్




- ఎస్ఏఎఫ్ఎఫ్ అండర్ 19 చాంపియన్‌షిప్‌ను భారత జట్టు గెలుచుకుంది. తుదిపోరులో బంగ్లాను భారత్ ఓడించింది. ఈ టోర్నీ మే 9 నుంచి 18 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని యూపియాలో నిర్వహించారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

